# తప్పుచేసేనే అమ్మా!

-గుమ్మా నిత్యకళ్యాణమ్మ

పాలవాడు ఉదయం అయిదుగంటలకే బెల్ మ్రోగించాడు. ఆ బెల్ మోతకు వసుంధరకు తెలివివచ్చింది. అయినా ఆమె పక్కమీద నుంచి దిగలేదు. రాత్రి ఇల్లు చక్కబెట్టుకుని పక్కమీదకు వెళ్ళేసరికి పదకొండు గంటలవుతుంది. ఉదయాన్నే లేవడానికి బద్ధకం.

పాలు తీసుకోవడం, వీధి గుమ్మం కడిగి ముగ్గు పెట్టడం, స్నానం చేసి కాఫీలు పెట్టడం సుజాత చేస్తుంది. అందువలన ఆరు గంటల వరకు వసుంధర మంచం దిగకపోయినా బాధలేదు.

పాలవాడు మూడో మారు బెల్ మ్రోగించాడు 'ఏమైంది? సుజాత ఇంకా మొద్దునిద్దర పోతున్నదా?' మనసులోనే అనుకుని మంచం దిగి వంటింటిలోకి వెళ్ళి గిన్నె తీసుకుని వీధి తలుపు తాళం తీయబోయింది. తాళం వేసిలేదు సరికదా గడియ కూడా వేసిలేదు. ముందుగా వసుంధర ఆశ్చర్యపోయింది. బహుశా తాను పరధ్యానంలో రాత్రి తాళం వేయడం మరచిపోయి వుంటుంది. వయసు పైబడుతున్న కొద్దీ మతిమరుపు ఎక్కువౌతున్నది.

"సుజాతగారు ఇంకా లేవలేదా?" పాలవాడు పాలుపోస్తూ అడిగాడు. వాడు జవాబు నాశించనూ లేదు ఈమె చెప్పనూ లేదు.

స్టవ్ మీద పాలుపెట్టి "సుజాతా! సుజాతా! ఏమిటా నిద్ర'' అంది గట్టిగా. అంతలోనే వసుంధరకు పిల్లమీద జాలి వేసింది. అది తొందరగా లేచి ఏం చెయ్యాలి? ఏదు కొండలవాడి దయ వల్ల అది ఇంటరు పాసైంది. తాము ఎలాగూ దానికి పెద్ద చదువులు చెప్పించదలచుకోలేదు. ఇన్నాళ్ళూ అయితే చదువుకోడానికి తెల్లవారుఝామునే లేచేది.

వసుంధర భర్త శంకరరావు ఒక ప్రయివేటు కంపెనీలో పనిచేసేవాడు. ఏడాది క్రితం ఊరిలోని బ్రాంచిని వేరొక చోటికి మార్చివేశారు. చాలాదూరం పోవాలి. ఆ జీతంతో రెండుచోట్ల సంసారం చెయ్యడం సాధ్యంకాదు. ఇంకా పిల్లల చదువులు పూర్తికాలేదు. అతనా ఉద్యోగాన్ని వదిలేసి మరోచోట పనిచేస్తున్నాడు. రోజులో పదిగంటలు పనిచేసినా వారు ఏడెనిమిది వందలకు మించి ఇవ్వడంలేదు. గుడ్డిలో మెల్ల అన్నట్లు పెద్దకొడుకు రామనాథం అందివచ్చాడు. బి. ఎస్.సి. పాసైన అతనికి స్థానిక షుగర్ ఫ్యాక్టరీలో ఉద్యోగం దొరికింది. వాడికి కిందటేడే పెళ్ళి చేశారు. వాడి భార్య గిరిజ. గిరిజ అత్తమామలను చిన్న చూపు చూడదు కాని సుజాత పొడ అంటే కిట్టదు.

సుజాత అంటే ఈ పిల్లకు ఎందుకు పడదో వసుంధరకు అర్ధంకాదు. సుజాత నెమ్మదస్తురాలు. ఎంతపని అయినా విసుక్కోకుండా చేస్తుంది. గిరిజ పట్ల ఆమెకు గౌరవ భావం వుంది. మరి సుజాత అంటే ఈ పిల్లకు పగ ఎందుకు? ఎప్పుడూ నూటిపోటి మాటలంటుంది. రుసరుసలాడుతుంది. సుజాత - వదిన ఏమన్నా సహిస్తుంది. ఎదురు చెప్పదు.


వసుంధర సుజాత పక్షం వహించి కోడలికి నచ్చచెప్పాలనుకుంటుంది. ఈ కాలం పిల్లలు తన మాట వింటారా? తన కొడుకును ఎలానూ ఆమె తన వశం చేసుకుంది. పెళ్ళాం మాట విని వాడు వేరింటి కాపురం పెడితే తమ బ్రతుకులు అధ్వాన్నం అవుతాయి. అందుకే ఆమె దుఃఖాన్ని దిగమింగుకుంటుంది.

గిరిజ టెన్త్ పాసైంది. సుజాత ఇంటరు పాసైంది. కాలం కలిసివస్తే సుజాత పై చదువులు చదువుతుంది. గిరిజ కన్నా సుజాత అందంగా వుంటుంది. ఈ కారణాలు చాలవూ ద్వేషాన్ని

నింపుకోవడానికి?

వసుంధరకు గిరిజ మనస్తత్వం అర్థమై తామరాకు మీద నీటిబొట్టులా కాలం నెట్టుకుపోతున్నది.

"అత్తయ్యగారూ! ఈ చదివింది చాలు. సుజాతకు పెళ్ళి చేయడం మంచిది" అంటుంది గిరిజ.




"నువ్వన్నది నిజమేనమ్మా! అయినా మంచి సంబంధం దొరకాలిగా" అంటుంది వసుంధర.

తన కూతురికి ఇంకా చదవాలని వుందన్న విషయం ఆమెకు తెలుసు. అయినా తాను చేయగల్గింది ఏమీలేదు.

రామనాథం అడకత్తెరలో పోకచెక్కలాగయ్యాడు. సుజాతకు పెళ్ళిచేసి సాగనంపమంటుంది భార్య. అన్నయ్యా నన్నింకా చదివించవా అంటుంది దీనంగా సుజాత.

గిరిజ చెప్పినట్లు తాము కోటీశ్వరులం కాము. తండ్రి సంపాదననగా ఎంత? ఈ కుటుంబం తనమీదే ఆధారపడింది. ఇంకా తమ్ముడూ చెల్లెలూ వున్నారు. వాళ్ళను కూడా చదివించాలి. రేపు తనకూ పిల్లలు పుడతారు. అలాంటి పరిస్థితుల్లో ఈ చెల్లెల్ని ఎలా చదివించగలడు?

చదువులో అది అపర సరస్వతి. మధ్యలో దాని చదువు ఆపేస్తే అది దానికి ఎదురుదెబ్బ.

తల్లి అభిప్రాయం అడుగుతాడు.

ఆమె ఎటూ చెప్పదు. సుజాత కేది ఇష్టమో ఆమెకు తెలియక కాదు. తను చెప్పింది చేస్తాడని ఆమెకు కొడుకుమీద నమ్మకంలేదు. గిరిజ ఇచ్చే సలహా ఏమిటో ఆమెకు తెలుసు.

"ఏమో బాబూ! మీ భార్యాభర్తలు ఆలోచించుకోండి. మోసేవాళ్ళు మీకు తెలియాలి కావిడి బరువు" అని అంటుంది.

సుజాత తండ్రి శంకరరావుకి ఇంత తొందరలో పిల్ల పెళ్ళి చేయడం ఇష్టంలేదు. ఆడపిల్ల అయినా దానికీ చదువుకునే అవకాశం ఇవ్వాలి.

" ఇంకా పద్దెనిమిదేళ్ళు నిండలేదు. గ్రాడ్యుయేట్ కాలేదు. అప్పుడే దాని పెళ్ళికి తొందరెందుకు?" అంటాడు.

చదువు ఎలాగూ చెప్పించలేం. పెళ్ళి కూడా చేయకపోతే అది సందు చూసుకుని ఎవరితోనో లేచిపోతుంది అంటుంది గిరిజ.

కోడలు అలాగంటే వసుంధరకు కొరడాతో కొట్టినట్లనిపిస్తుంది. కాని తను కలుగజేసుకుంటే కోడలు మరింత రెచ్చిపోతుంది.

వసుంధర అన్యమనస్కంగానే ఒకదాని తరువాత మరో పని చేసుకుపోతున్నది. ఉప్మా కూడా చేసింది.

ఆమెకు నిన్న కొడుకు అన్న విషయం గుర్తుకొచ్చింది.

"ఆ కుర్రాడు టెన్త్ పాసయ్యాడు. కో-ఆపరేటివ్ బ్యాంకులో ఎటెండరుగా పనిచేస్తున్నాడు. నాలుగైదేళ్ళ తరువాత గుమస్తా అయ్యే అవకాశాలున్నాయి. కట్నం పాతిక వేలు కావాలంటున్నారు. మన సుజాత వాళ్ళకు నచ్చింది" అన్నాడు రామనాథం తల్లితో.

"పాతికవేలే ఎక్కువ మనకు. ఇంతకన్నా మంచి సంబంధం చేసే స్థోమత మనకేది?" అంది గిరిజ.

వసుంధరకు ఆ భార్యాభర్తల మాటలు నచ్చలేదు. ఆమె భర్తకు కోపం వచ్చింది.

"రామం! కాకిముక్కుకి దొండపండా?

అది ఇంటరు పాసైంది. వాడు టెన్త్ పాసయ్యాడంటున్నావు. చేస్తున్నది బంట్రోతు ఉద్యోగం. అది నీ చెల్లెలు అన్న మాట మరచిపోకు'' కాస్త కటువుగానే అన్నాడు శంకరరావు.

అతని మాటలకు విలువెవరిస్తారు?

వసుంధర కల్పించుకుంది.

"దాని చెవిలో వెయ్యి. అది ఇష్టపడితే అప్పుడు చూద్దాం" అంది.

"అత్తయ్యగారూ మీరు మరీను. ఎవరైనా ఎద్దునడిగి గంతలు కడతారా? మాట వరసకు మీ అమ్మాయి ఏ నలకూబరుడు లాంటి వాడినో లేదా కోటీశ్వరుని కొడుకు సంబంధమో తెమ్మంటే మనం తేగలమా? ఆయన అన్నీ ఆలోచించే ఈ సంబంధం పట్ల మొగ్గు చూపించారు. ఎల్లుండి బుధవారం పెళ్ళిచూపులు" అంది గిరిజ. మరి మాట్లాడడానికి ఏమీ లేనట్లు భార్యాభర్తలు తమ గదిలోకి వెళ్ళిపోయారు.

బుధవారం అంటే ఇక ఒకే రోజుంది.

"అమ్మా! అక్కయ్య ఏదీ?" సుజాత తమ్ముడు తల్లినడిగాడు. వసుంధర మళ్ళీ ఈ లోకంలో పడింది.

" ఏం? గదిలో మంచం మీద లేదా?"

"ఊహు"

వసుంధర గాబరా పడింది. వీధి తలుపు గడియ తీసి వుంది. అంటే పాలవాడు రాక ముందే అది బయటకు వెళ్ళిందా? ఎటు వెళ్ళింది?

కొడుకుతో చెప్పింది సుజాత ఇంటిలో లేదని.

రామం అధైర్యపడలేదు. "పరిమళ ఇంటికో, వైశాలి ఇంటికో వెళ్ళి వుంటుంది" అన్నాడు నిదానంగా.

'చెప్పకుండా ఎక్కడకూ వెళ్ళే పిల్లకాదే!? పాలవాడు వచ్చేసరికే అది ఇంట్లో వున్నట్లు లేదు. అంత తెల్లవారకుండా ఏ స్నేహితురాలి ఇంటికో ఎందుకు వెళ్తుంది' ఆమె స్వగతంగా అనుకుంది. ఆమె ఏదో కీడు శంకించింది. కాళ్ళూ చేతులూ ఆడలేదు.

"నాకు తెలుసు అత్తగారూ! ఆ పిల్ల ఎప్పుడో ఒకనాడు ఇలాంటి పనిచేస్తుందని" అంది గిరిజ.

తన చెల్లెలు ఏదో కానిపని చేసినట్లు తన భార్య నోరుజారడం రామనాథం సహించలేకపోయాడు. "నువ్వు నోరు మూసుకో" అన్నాడు భార్యను.

" మిమ్మల్ని కట్టుకున్నాను కాబట్టి నా నోరు మూసేయగలరు. మరి కొంతసేపటికి లోకమంతా కోడై కూస్తుంది. మీరు ఎవరి నోళ్ళు మూయించగలరు? ఆ కామేశంతో దీని వ్యవహారం నాకు నచ్చలేదు. ఎప్పుడూ ఏవో

గుసగుసలూ పకపకలూ. వాడు ఇంటిలో వున్నాడో లేక ఉడాయించేడో ముందు చూడండి" అంది గిరిజ.

మరొకప్పుడైతే శంకరరావు గిరిజను హద్దుమీరకని దెబ్బలాడి వుండేవాడు. కాని ఆ పరిస్థితుల్లో ఆమెను ఏమీ అనలేకపోయాడు.

"నేనలా పరిమళ ఇంటికి వెళ్ళివస్తాను" అంటూ లేచాడు శంకరరావు.

"మీరెందుకు? నేను వెళ్తాను" అని రామనాథం సైకిల్ తీసుకొని బయలుదేరాడు.

వసుంధర చేసిన ఉప్మా అలాగే వుంది. భగవంతుడా మాకు అన్యాయం చేయకు అని ఆ కనిపించని దేవుడికి మొక్కిందామె. సుజాత తమ్ముడూ చెల్లి అమ్మకు చెరోవేపు దిగులుగా నిల్చున్నారు.


గిరిజ ఒక ప్లేటుతో ఉప్మా తీసుకుని తన గదిలోనికి వెళ్ళింది.

రామనాథం ఎలా వెళ్ళాడో అలా తిరిగి వచ్చాడు. అతని ముఖం చూస్తేనే అర్థమైంది వసుంధరకు, తన బిడ్డ వారి ఇళ్ళకు వెళ్ళలేదని.

" ఏంరా! అది అక్కడకు వెళ్ళలేదా?" అడిగింది.

" ఏమండీ! ఎదురింటి కామేశం ఇంట్లో లేడు. నిన్నరాత్రి హైదరాబాదు వెళ్ళేడట" అంది గిరిజ.

# శుభ సంక్రాంతి



పుష్య పూబంతుల సుమధురం
హేమంత ఆగమన శుభోదయం
ముంగిట రంగవల్లుల సోయగం
సంక్రాంతి సంబరాల ఆరంభం
కొంగ్రొత్త అందాల పల్లెలు
కొత్త బియ్యం తీపి వంటలు
అల్లుళ్ళ ముద్దు మురిపాలు
మనుమల తీపి మాటల మూటలు
హైటెక్ యుగంలోనైనా
మారని మన పల్లెలు.
అభివృద్ధి పథానికి సోపానం
ఆంధ్ర రైతు కృషి అనన్య సామాన్యం
ప్రతీ శుభోదయం వెలుగూ
రైతన్నకు ఆనందదాయకం కావాలనీ!
ప్రతీ సంక్రాంతి మనందరకూ
శుభప్రదం కావాలనీ!!

–భళ్ళమూడి నాగరాజు

గిరిజ ఎత్తిపొడుపులకు శంకరరావుకి కోపం వచ్చింది.

"మంచి పనిచేసింది. మీరో ముదనష్టపు సంబంధం చేసి దాని పీడ వదిలించుకోవాలనుకున్నారుగా. దానికి నచ్చిన వాడితో అది లేచిపోయింది'' అన్నాడు శంకరరావు.

"నాన్నా! చెల్లెలికి ఇష్టంలేకపోతే వేం ఆ సంబంధం బలవంతాన చేయాలనుకోలేదు" అన్నాడు రామనాథం.

" ఆ ముక్క దానితో అని వుంటే ఈ అనర్థం జరిగేదా?" అన్నాడు శంకరరావు.

"అదేమిటండీ! వాడు దీనికన్నా ఆరు నెలలు చిన్న. సుజాతను అక్కా అని పిలుస్తాడు. అదెట్లా సాధ్యం'' అంది వసుంధర. తన కూతురు కామేశంతో లేచిపోయి వుంటుందంటే ఆమెకు నమ్మకం కలగలేదు.

ఆ ఇంటిలో విషాదం అలముకుంది.

గోడ గడియారం కొట్టిన గంటల శబ్దం మాత్రమే వినిపిస్తున్నది.

వసుంధర వంట ప్రయత్నం చేయలేదు.

పన్నెండు దాటింది.

"పిన్నీ! మీకు ఫోను" రెండిళ్ళ అవతల వున్న కామాక్షిగారి మనుమడు వచ్చి వసుంధరతో చెప్పాడు.

వసుంధర చీర కుచ్చెళ్ళు సర్దుకుని వాడి వెంట వెళ్ళింది. ఏమిటి వినవలసి వస్తుందోనని ఆమె కాళ్ళు తడబడ్డాయి.

" ఇంకెవరిది? మీ చెల్లెలిదే అయి వుంటుంది. తను చేసిన ఘన కార్యం మీ అమ్మగారికే చెప్పగలదు. వేరొకరి ఫోనైతే మీకో మామగారికో రావాలి" అంది గిరిజ.

శంకరరావు అసహనంగానే ఆమె అన్నది విన్నాడు.

వసుంధర పదినిమిషాల్లో తిరిగి వచ్చింది.

ఆమె ఎవరితోనూ మాట్లాడలేదు.

ఆమె కడుపులో బాధ వుందో, సంతోషం వుందో?

ఆ నిర్వికారమేమిటో ఎవరికీ అర్థం కాలేదు. భార్యను అడిగే ధైర్యం శంకరరావుకి లేదు.

తల్లినోటి వెంట ఏదో మాటరాదా అని రామనాథం ఎదురుచూస్తున్నాడు.

ఆ ముక్క అత్తగారు తెగించి చెప్పగలరా అనుకుంది గిరిజ.

వసుంధర నేరుగా వంటింటిలోకి వెళ్ళి స్టవ్‌ను వెలిగించి ఉప్మా వేడిచేసింది.

"జరిగిందేదో జరిగింది. ఆకలితో ఎంతసేపు వుంటారు తినండిరా పిల్లలూ" అంది ప్లేట్లలో ఉప్మా వేస్తూ.

అమ్మ ప్రవర్తన రామనాథానికి అర్థం కాలేదు. చెల్లి చేసిన పనికి మరొకరైతే ఎడబొబ్బలూ పెడబొబ్బలూ పెట్టేవారు. తల్లి నిర్వికారంగా ఎలా వుండగలుగుతున్నది?

"అమ్మా! ఫోను ఎక్కడ నుంచి? ఏమిటి దాస్తున్నావు?" అన్నాడు రామనాథం.

" నీ చెల్లెలు ఇల్లు వదిలి వెళ్ళిపోయిందిరా. ఇంటిలోని వారు తన బాధ నర్థం చేసుకోలేదన్న బాధతో వెళ్ళిపోయింది. మీరు కుదర్చబోయే సంబంధం దానికిష్టం లేదు" అంది వసుంధర.

"అంటే గిరిజ చెప్పింది కరక్టేనా?"

"నీ భార్య ఏం చెప్పింది! తనకు తమ్ముడితో సమానమైన ఆ కామేశంతో లేచిపోయిందనేనా? ఒరేయ్ రామం. అది నీ చెల్లెలురా. నా కడుపున పుట్టింది. అది అంత కానివని ఎలా చేస్తుందనుకున్నావు? నన్ను చదివించండి అని మనల్ని ప్రాధేయపడింది. ఈ పెళ్ళి నాకొద్దు అని మొర్రోమంది. మనం దాని మాట వినలేదు అందుకే 'మామయ్యా! నాకు చదువుకోవాలని ఉంది. నన్ను కాలేజీలో చేర్పించవా!' అని తన మామయ్య నడగడానికి విశాఖపట్నం వెళ్ళింది. అన్నయ్య ఫోను చేసి సుజాత కట్టుబట్టలతో వచ్చిన విషయం చెప్పాడు'' అంది కన్నీళ్ళను తుడుచుకుంటూ.

"మీకు చెప్పకుండా ఇంట్లోంచి పారిపోయి నేను తప్పుచేసేనే అమ్మా! అంటూ అది ఫోనులో ఏడ్చింది" అంది వసుంధర.

అందరూ మౌనంగా వుండిపోయారు. తప్పుచేసింది ఎవరనే ప్రశ్న వసుంధర మనసు తొలుస్తూ వుంది.

○